టీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్, జూన్27: సదాశివనగర్ మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో పీజీటీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భానుమతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ జువాలజీ, బోటని పోస్టులకు పీజీ, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుచేసుకున్న అభ్య ర్థులకు శుక్ర, శనివారాలలో డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. వేతనం రూ.18వేలు ఉంటుందని, ఎంపికైన వారు ఇంగ్లీషు మీడియంలో బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రైతుభరోసా అందేనా?



- ఈ సీజన్‌లో మరింత ఆలస్యం కానున్న పెట్టుబడిసాయం
- రైతు భరోసాకు అభిప్రాయాల సేకరణ
- విధివిధానాలపై ప్రభుత్వం కసరత్తు
- సబ్ కేబినెట్ నిర్ణయం తర్వాతే పెట్టుబడి సాయం
- ప్రస్తుతం రుణమాఫీపైనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- పెట్టుబడి సాయానికి రైతులకు తప్పని నిరీక్షణ

కామారెడ్డి, జూన్27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పెట్టుబడిసాయం కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతుబంధు పథకానికి బదులు రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకుగాను విధివిధానాలను ఖరారు చేసేందుకు ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని వేయడంతో పెట్టుబడిసాయం ఆలస్యంగానే అందే అవకాశాలు ఉన్నాయి. అయితే రైతుభరోసా పథకాన్ని అమలుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతోంది. గత మూడురోజుల కిందట రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆయా జిల్లాల కలెక్టర్‌లతో నియోజకవర్గాల వారిగా రైతు భరోసా పథకం అమలు తీరుపై అభిప్రాయ సేకరణ కోసం వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. 10 రోజుల్లోగా రైతు భరోసా పథకాన్ని అమలుచేసేందుకు వివిధవర్గాల వారినుంచి అభిప్రాయాలు తీసుకుని సమర్పించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం నిధులు ఆలస్యంగానే అందనున్నాయి.

రైతుబంధు.. రైతు భరోసాగా..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలను అమలుచేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అందులో భాగంగా రైతుభరోసా పథకాన్ని అమలుచేస్తామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో ఎకరానికి రెండు సీజన్‌లకు కలిపి రూ.15వేలు కౌలు రైతులకు కూడా అంతేమొత్తాన్ని, రైతుకూలీలకు రూ.12వేల చొప్పున అందజేస్తామని ప్రకటించింది. అంతకుముందు ఇదే పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలుచేసింది. పట్టా కలిగిన వారందరికీ సీజన్‌కు రూ.5వేల చొప్పున రెండు సీజన్‌లకు రూ.10వేలు పెట్టుబడి సాయాన్ని అందజేసింది. ఇందులో కౌలు రైతులకు ఎలాంటి సాయాన్ని అందజేయలేదు. ఈ పథకం అమలు చేసేందుకు అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అనుసంధానం చేసుకుని నేరుగా రైతుల ఖాతాలో డబ్బులను జమచేసింది. ఈక్రమంలో సాగులో ఉన్న, సాగులో లేని భూములు, రహదారులు, ప్రాజెక్టుల కింద సేకరించిన భూములకు, నాలా మార్పిడీ చేయకుండా వెలువడిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు, భూస్వాములకు, ప్రభుత్వ ఉద్యోగులకు సైతం ఎలాంటి విధివిధానాలు రూపొందించకుండానే అప్పటి ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలుచేసింది. ఈ పథకం ద్వారా జిల్లాలో 3.15 లక్షల మంది రైతులకు సుమారు రూ.220 కోట్లు చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు పథకాన్ని సవరించి తాము ప్రకటించిన రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని భావించింది. గడిచిన యాసంగి సీజన్‌లో పాత విధానంలోనే రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించింది.

రైతు భరోసా అమలుకు సబ్‌కేబినెట్



వానకాలం సీజన్ ప్రారంభంకావడంతో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతీ వానాకాలం యాసంగి సీజన్ ప్రారంభ మయ్యే ముందట రైతుబంధు కింద ఎకరానికి రూ.5 వేల చొప్పున పెట్టుబ డిసాయాన్ని అందించేది. గడిచిన యాసంగి సీజన్ సైతం కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం నిధులను రైతుల ఖాతాలో జమచేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాన్ని అమలు చేస్తారా, పాత పథకం ప్రకారమే పెట్టుబడి సొమ్మును ఖాతాలో జమ చేస్తారా అని రైతులు చర్చించుకుంటున్నారు. దానికంటే ముందు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆగస్టు 15 వరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈనెల 21న నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో ముందుగా రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు సభ్యులుగా ఉపసంఘాన్ని నియమించారు. ఈ ఉపసంఘం రైతు సంఘాలు, రైతుకూలీ సంఘాలు రాజకీయ పార్టీ నాయకులు వివిధ వర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి జూలై 15 లోపు నివేదిక అందజేయాల్సి ఉంటుంది. ఈ నివేదికను ప్రతీ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఎమ్మెల్యేల అభిప్రాయాలను స్వీకరించి విధివిధానాలను ఖరారు చేయనున్నారు.

అనర్హుల ఏరివేతకు చర్యలు

రాష్ట్రప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందు రైతుభరోసా పథకం అమలుకు చర్యలు చేపడుతోంది. ఈ పథకంలో లబ్ధి పొందుతున్న అనర్హులను ఏరివేసేందుకు ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకెళ్తోంది. పథకం అమలు చేసేందుకు 10ఎకరాల వరకు పరిమితం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. కొండలు, గుట్టలు, బండరాయి భూములు, సాగుకు యోగ్యం కాని భూములను, ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం సేకరించిన భూములను, ప్రభుత్వ ఉద్యో గుల భూములను, రహదారులు, నాలా కన్వర్షన్ లేకుండా వెంచర్‌లుగా మార్చిన భూములను పథకం నుంచి తొలగించనున్నారు. అదేవిధంగా ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు రైతుభరో సా అందకుండా చేసేందుకు ప్రభుత్వం విధివిధానాలను ఖరారుచేస్తుంది. అలాగే కౌలు రైతులు చేస్తున్న కౌలుకు చేస్తున్న భూముల యాజమానులకు కాకుండా రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని సదరు కౌలురైతుకు కొంత, పట్టాదారులకు కొంతసాయాన్ని అందించే అవకాశాలు ఉన్నాయి. విధి విధానాలు ఖరారైన తర్వాతే ఈ సీజన్ నుంచి గానీ, వచ్చే యాసంగి సీజన్ నుంచి గానీ పెట్టుబడిసాయాన్ని అందించే అవకాశాలు ఉన్నాయి.

ప్రాచీన కట్టడాలను రక్షించడం అభినందనీయం



లింగంపేటలోని నాగన్న బావిని పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్
- ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా మార్చాలని కార్యదర్శికి ఆదేశం
- అమ్మ ఆదర్శ పాఠశాల తనిఖీ

లింగంపేట, జూన్27: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రాచీన కట్టడం నాగన్న బావిని పరిరక్షించేందుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రశంసించారు. లింగంపేట మండల కేంద్రంలోని ప్రాచీన నిర్మాణం నాగన్న బావి (ఎనుగులబావి)ని కలెక్టర్ పరిశీలించారు. ప్రాచీన కట్టడాలను భావితరాలకు తెలిపేందుకు స్వచ్ఛంద సంస్థలు వాటిని పునరుద్ధరించడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఉపాధిహామీ పథకం ద్వారా బావికి వెళ్లడానికి ఫార్మేషన్ రోడ్డును వేయాలని అధికారులకు చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటాలని సూచించారు. బావి వద్ద నాలుగు హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. బావి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీలో బావిలోని మట్టిని పూడిక తీయడం ద్వారా బావిలో వర్షపు నీరు నిలిచి చుట్టుపక్కల బోరు బావులలో భూగర్భ జలాలు పెరిగాయని ఆయన తెలిపారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఆరోగ్య కేంద్రంలోని వసతులను, మందులు, సిబ్బంది వివరాలను జిల్లా ఉపవైద్యాధికారి శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలలో పిచ్చిమొ క్కలు ఏపుగా పెరిగాయని, వాటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చాలని ఆయన పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌ను ఆదేశించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతు పనులను పరిశీలించారు. పాఠశాల భవనం భవనం స్లాబు మరమ్మతులు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం పనులు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితం బోధించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థికి బహుమతిగా పెన్ను, నోటుబుక్‌లను అందజేశారు. మధ్యాహ్న భోజనం రుచికరమైన వంటలు వండాలని ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సురేందర్, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో శోభారాణి, ఎంపీపీ గరీబున్నీసా, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేష్, ఎంఈవో రామ స్వామి, పంచాయతీరాజ్ ఏఈ రాకేష్, వైద్య అధికారి హిమబిందు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్



పెద్దచెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డిటౌన్, జూన్27: కామారెడ్డి పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. గురువారం పట్టణంలోని పెద్దచెరువు, బుర్రమత్తడి కాలువ, పట్టణ ప్రకృతివనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మంచినీటిని సరాఫరా ఎప్పటికప్పుడు ప్రజలకు అందేలా కృషిచేస్తానని తెలిపారు. అదేవిధంగా డ్రైనేజీ నీటి కాలువ, మంచినీటి కాలువ పనులను పరిశీలించి బుర్రమత్తడి కాలువ పనులు అతివేగంగా చేయాలని తెలిపారు. పట్టణ ప్రకృతివనాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ప్రజలకు ఆహ్లాదం పంచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్‌లు పాత శివకృష్ణమూర్తి, లత, ఇమ్రాన్, నజీరుద్దిన్, గెరిగంటి లక్ష్మీనారాయణ, అంజద్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పాలన సాగేదెలా?

- గ్రామ పంచాయతీలకు నిధుల కొరత
- పారిశుధ్య కార్మికులకు వేతనాలు కరువు
- డీజిల్‌కూ డబ్బుల్లేక మూలన పడ్డ వాహనాలు
- పంచాయతీ కార్యదర్శులకు తప్పని తిప్పలు

ఎల్లారెడ్డి, జూన్27: గ్రామ పంచాయతీల ఖాతాలో నిధుల్లేక లేక అభివృద్ధి ముందుకు సాగడంలేదు. పల్లెలకు కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే అన్న చందంగా మారింది. నిధులు లేక కనీసం పంచాయతీ కార్యదర్శులకు వేతనాలు అందని పరిస్థితిలో గ్రామ పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలనలో నిధులు లేక గ్రామ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 22 మండలాలలోని 526 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో మేజర్ గ్రామ పంచాయతీలు తక్కువ జనాభా కలిగిఉన్నాయి. పంచాయతీలకు గతంలో 3నెలలకు ఒకసారి స్టేట్ ఫైనాన్స్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించేది. 15వ ఫైనాన్స్ నుంచి కేంద్రం నుంచి నిధులు కేటాయించేది, ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో విడుదల కావడం లేదు. ప్రతినెల 2011 జనాభా ప్రాతిపదికన పంచాయితీలకు నిధులు విడుదల అయ్యేవి. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వాలు మారడంతో పంచాయతీలకు నిధులు విడుదల కాలేదు. దీంతో ప్రత్యేక అధికారుల పాలనలో కార్యదర్శులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వ ం ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్లు కేటాయించింది. వీటి నిర్వహణ కూడా ప్రస్తుతం ఇబ్బందిగా మారింది. డీజిల్, మరమ్మతులు చేయించలేక ట్రాక్టర్లు మూలన పడుతున్నాయి. పలు గ్రామాల్లో డీజిల్ తేవడానికి ఆర్థిక ఇబ్బందులతో రెండు, మూడు రోజులకు ఒకసారి ట్రాక్టర్ల ద్వారా చెత్తను తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 112 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తే పంచాయతీలు అభివృద్ధిల్లో ముందుకు సాగే అవకాశం ఉందని ప్రజలు కోరుతున్నారు.

వేతనాలు ఇవ్వాలి: సాయిలు, కార్మికుడు

మాకు ప్రతీనెల వేతనాలు ఇవ్వలేదు. ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి వేతనాలు వచ్చేలా చూడాలి. అలాగే మమ్మల్ని పర్మినెంట్ కూడా చేయాలి.

ప్రభుత్వ నిధులు విడుదల చేయాలి

- వెంకట్ రాములు, కార్యదర్శి

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు చేయడం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ట్రాక్టర్ రిపేర్లు, డీజిల్‌తో పాటు చిన్న పాటి బోరు మోటార్ల మరమ్మతులు ఇతర పనులకు ఇబ్బందిగా ఉంటుంది. ప్రభుత్వం పంచాయితీలకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే వరకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.



మెదక్ టూ రుద్రూర్

- ప్రారంభమైన జాతీయ రహదారి విస్తరణ పనులు
- రోడ్డు విస్తరణకు రూ.899 కోట్లు
- ఇప్పటికే పనుల ప్రారంభం
- హవేళి ఘన్‌పూర్ నుంచి మొదలైన పనులు

నాగిరెడ్డిపేట, జూన్ 27: హైదరాబాద్ - మెదక్ - బాన్సువాడ (హెచ్‌ఎంబీ) జాతీయ రహదారి 765డీ మెదక్ - రుద్రూరు మధ్య జరగాల్సిన జాతీయ రహదారి విస్తరణ నిర్మాణం పనులు మొదలయ్యాయి. కేంద్రప్రభుత్వం 2022లో ఈ రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్పుతూ జాతీయ రహదారి విస్తరణ నిర్మాణం కోసం రూ.899 కోట్లు మంజూరుచేసింది. 5 మార్చి 2024న పటాన్ చెరువులో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని ఈ రోడ్డు విస్తరణ పనులను వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం మెదక్ జిల్లా హవేళి ఘన్‌పూర్ మండల కేంద్రం నుంచి ఈ జాతీయ రహదారి నిర్మాణం పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి.

హైదరాబాద్ టూ మెదక్ రోడ్డు పనుల పూర్తి

హైదరాబాద్ టూ మెదక్ వరకు జాతీయరహదారి విస్తరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ మీదుగా నిజామాబాద్ జిల్లా రుద్రూరు వరకు ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ రోడ్డు విస్తరణ పనులను రెండు ప్యాకేజీల ద్వారా జరపనున్నారు. మెదక్ జిల్లా కేంద్రం నుంచి ఎల్లారెడ్డి వరకు సుమారు 43.91 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించడానికి రూ.399 కోట్లు, ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడ మీదుగా రుద్రూరు వరకు సుమారు 51.66 కిలోమీటర్ల పొడవు రహదారి విస్తరణ పనుల కోసం రూ. 500 కోట్లు ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం అధికారులు సర్వేలు పూర్తిచేశారు. రహదారి విస్తరణకు సంబంధించిన భూ సేకరణ పనులు సైతం దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. దీంతో సంబంధిత అధికారులు ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం మొదటగా మెదక్-ఎల్లారెడ్డి ప్యాకేజీ జాతీయరహదారి నిర్మాణం పనులు హవేళి ఘన్‌పూర్ మండలకేంద్రం నుంచి ప్రారంభమయ్యాయి. పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

మెదక్ - నర్సాపూర్ ప్యాకేజీల ద్వారా పనులు

మెదక్ నుంచి రుద్రూరు వరకు రెండు ప్యాకేజీల ద్వారా జాతీయ రహదారి విస్తరణ పనులు జరగనున్నాయి. మెదక్ నుంచి నాగిరెడ్డిపేట మండలం మీదుగా ఎల్లారెడ్డి వరకు ఒక ప్యాకేజీగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. అలాగే ఎల్లారెడ్డి నుంచి బొగ్గు గుడిసే చౌరస్తా, మహ్మద్‌నగర్, బాన్సువాడ పట్టణం మీదుగా రుద్రూరు వరకు మరోప్యాకేజీ ద్వారా జాతీయ రహదారి విస్తరణపనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం మెదక్ -ఎల్లారెడ్డి ప్యాకేజీ రహదారి నిర్మాణం పనులు మొదలయ్యాయి.

ప్రధాని శంకుస్థాపనతో మొదలైన పనులు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపనతో మెదక్ - రుద్రూరు 765డీ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశాక, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండటం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తిరిగి బీజేపీ అధికారంలోకి రావడం, నరేంద్రమోదీ ప్రధాని కావడంతో ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రాష్ట్ర రహదారిని 2022లో కేంద్రప్రభుత్వం జాతీయ రహదారి 765డీగా గుర్తిస్తూ మంజూరుచేసింది. రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.899 కోట్లు సైతం మంజూరుచేసింది. రోడ్డువిస్తరణ పనుల శంకుస్థాపనలో కొంతజాప్యం జరగడంతో పనులు ప్రారంభం కాలేదు. అధికారులు రోడ్డు సర్వే పనులు నిర్వహించాక ఈ జాతీయ రహదారి విస్తరణ నిర్మాణం పనులను భారత ప్రధాని మోదీ స్వయంగా శంకుస్థాపన చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతంగా జరిగి అతి త్వరలోనే పూర్తికానున్నాయి. జాతీయ రహదారి పనులు ప్రారంభం కావడంతో మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ మూడు జిల్లాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వంద ఫీట్లతో రహదారి విస్తరణ

మెదక్ - రుద్రూరు జాతీయ రహదారి రెండు వరుసల విస్తరణ పనులు 150 ఫీట్లతో చేస్తారనే ప్రచారం మొదట్లో జరిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ రహదారి గుండా నాగిరెడ్డిపేట, మహ్మద్ నగర్, నసురుల్లాబాద్, వర్ని, రుద్రూరు మండల కేంద్రాలతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ కేంద్రాలు ఉన్నాయి. ఈ మండల, డివిజన్ కేంద్రాల మీదుగా రహదారి విస్తరణ పనులు జరగాల్సి ఉంది. దీంతో మండల కేంద్రాల, డివిజన్ కేంద్రాల రహదారి ఇరు పక్కలా ఉన్న భవనాలు, ఇళ్ల యజమానులు, ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వం ఎట్టకేలకు రహదారి విస్తరణ పనులు వంద ఫీట్లతో చేపట్టాలని నిర్ణయించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి మధ్యలోనుంచి ఇరు పక్కల 50 ఫీట్లతో రహదారి విస్తరణ పనులు జరగనున్నాయి.

తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా

డిచ్‌పల్లి,జూన్ 27: మండలంలోని మెంట్రాజ్‌పల్లి 246 సర్వే నంబర్‌లో గత కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్న భూమిని కొందరు కబ్జాకు ప్రయత్నాలు చేస్తు న్నారని రెవెన్యూ అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కొందరు మండల అధికారులు వారికి సహకరించడం సరికాదన్నారు. ఆ అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. తమకు సమాచారం ఇవ్వకుండానే తమ భూ ములు సర్వేయర్ సర్వేలు నిర్వహిస్తున్నరని బాధితులు సుప్రియ, సావిత్రి, సాయిలు, లక్ష్మీ,గంగామణి, పోసాని, శాంత, రాజమని పాల్గొన్నారు.


కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

బంద్ పేరిట విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దు : సీఐ

బోధన్‌రూరల్, జూన్ 27: పాఠశాలలు, కళాశాలల బంద్ పేరిట విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులకు ఇబ్బందులు కలిగించవద్దని పట్టణ సీఐ వీరయ్య అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేలాది రూపాయల ఫీజులు చెల్లించి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రులు విద్యార్థులను చదివిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల విలువైన సమయాన్ని విద్యార్థి సంఘాల నాయకులు రోడ్లపైకి తీసుకువచ్చి ధర్నాలు చేయించడం, పాఠశాలలు, కళాశాలలను బంద్ చేయించడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు స్కూల్ వద్దకు ఎవరైనా బలవంతంగా వచ్చి ఇబ్బందులు కలిగిస్తే వారిపై తమకు సమాచారం ఇవ్వాలని, కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా బలవంతంగా విద్యాసంస్థలను మూయించాలని చూస్తే కఠినచర్యలు తప్పవన్నారు. స్కూళ్లు, కాలేజీల యాజమాన్యం వారే మూసివేస్తే ఫర్వాలేదు. కాని ఎవరైనా బలవంతంగా మూసివేయించాలని చూస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్‌లో అవినీతిపై కమిషనర్‌కు ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్, జూన్27: మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని గురువారం కమిషనర్ రాజుకు బీజేపీ నాయకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత పాలకవర్గం 2023లో మొరం మట్టి వేసినట్టు రూ.25లక్షలు అక్రమంగా రికార్డు చేశారని, మోటర్ పంప్ సెట్‌ల రిపేర్‌ల పేరు మీద నాలుగు శాతం కమిషన్‌తో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, చెత్త సేకరణ కొరకై నాణ్యత లేని ఆటో ట్రాలీలు కొనుగోలు చేశారని, అక్రమ లే అవుట్‌లు చేశారని, అలాగే ప్రభుత్వ ఇరిగేషన్ స్థలాలతో పాటు అసైన్‌మెంట్ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు జరుగకుండా ఇంటినెంబర్‌లు కేటాయించారని, వీటిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ జీవీ.నర్సింహారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, ఆకుల శ్రీనివాస్, గుర్రం విజయానంద్, కలిగోట ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడి ఫౌండేషన్‌ను సందర్శించిన న్యాయాధికారి

కోటగిరి,జూన్27: మండల కేంద్రంలోని గుమ్మడి ఫౌండేషన్ బాయ్స్ హోమ్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి పద్మావతి గురువారం సందర్శించారు. పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి గుమ్మడి ఫౌండేషన్ పేరును నిలబెట్టాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గుమ్మడి ఫౌండేషన్ నిర్మాతలు గుమ్మడి శ్రీధర్, గుమ్మడి సుచిత్ర, మేనేజర్ మధు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనచోదకులకు జరిమానాలు

డిచ్‌పల్లి, జూన్ 27 :పోలీసులకు చిక్కకుండా ఎటువంటి ధ్రువ పత్రాలు గానీ డ్రైవింగ్ లైసెన్స్ లు లేకుండా వాహనాలు నడుపుతున్న వాహనచోదకులను పట్టుకొని పోలీసులు జరిమానాలు విధించారు. గురువారం డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. సుమారు 100వాహనాలను పట్టుకొని ఠాణాకు తరలించారు. ఆర్టీఏ అధికారులు అందుకు అనుగుణంగా జరిమానాలు విధించారు.

గొర్రెల కాపారి మృతి

జక్రాన్‌పల్లి, జూన్ 27: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన ముక్కెర గంగమల్లు(50) గొర్రెల కాపారి మృతిచెందినట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. గురువారం సాయంత్రం అర్గుల్ గ్రామ శివారులోని కకరకాయల సంతోష్ పొలంలో ముక్కెర గంగమల్లు గొర్లు కాస్తుండగా చనిపోయి పడి ఉన్నాడని, గుండెపోటు వచ్చి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'జెన్‌కో ద్వారానే విద్యుత్ కేంద్రం నిర్మించాలి'

మెండోర, జూన్27: రామగుండంలోని జెన్‌కో విద్యుత్ కేంద్రం స్థలాన్ని సింగరేణి కేటాయించి అందులో కొత్త విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడానికి నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని.. దానిని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని యూనియన్ నాయకుడు రఫీక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని నిరసిస్తూ పోచంపాడ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో జెఏసీ ఆధ్వర్యంలో ఎస్‌ఈ శ్రీనివాస్‌కు విద్యుత్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆ స్థలంలో జెన్‌కో ద్వారానే విద్యుత్ కేంద్రం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసీ నాయకులు సతీష్, భరత్, శ్రీనివాస్, విద్యుత్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో తైబజార్ వేలం రేపటికి వాయిదా

కమ్మర్‌పల్లి, జూన్ 27: మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన తైబజార్ వేలంలో నిర్ణీత టార్గెట్ రానందున శుక్రవారానికి వాయిదా వేసినట్లు పంచాయతీ ప్రత్యేక అధికారి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ వెల్లడించారు. గురువారం తైబజర్ వేలం నిర్వహించగా అనుకున్న విధంగా (లక్షా88వేలు) టార్గెట్ రాకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి శాంతికుమార్ తెలిపారు. రెండు సంవత్సరాలు వరుసగా లక్షా 5 వేలు, లక్షా 16 వేల వేలం జరుగగా ఈసారి నిర్ణీత ప్రైజ్‌మని లక్షా 88 వేలు ఖరారు చేయగా కేవలం లక్ష రూపాయలకే వేలం పాట ఆగిపోవడంతో రేపటికి వాయిదా వేసినట్లు తెలిపారు. గురువారం నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో సదాశివ్, మాజీ ఉప సర్పంచ్ పాలెపు గంగారాం, గ్రామస్తులు మార్కండేయులు, బాబూరావు, పాలెపు రాజేశ్వర్ పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

ఇతిహాస సంకలన సమితి నూతన కమిటీ ఎన్నిక

నిజామాబాద్ అర్బన్, జూన్ 27:అఖిల భారతీయ సంస్థ ఇతిహాస సంకలన సమితి జిల్లా నూతన కమిటీ ఎన్నిక గురువారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. సంస్థ సీనియర్ సభ్యుడైన కందకుర్తి యాదవరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరేష్‌కుమార్, సంరక్షకుడిగా యాదవరావు, తాటివీరేశం, కార్యదర్శులుగా చిలుముల మోహన్‌దాస్, గౌరవ సలహాదారులుగా అంజనేయులు, ఉపాధ్యక్షురాలిగా శైలిబెల్లాల్, ప్రధాన కార్యదర్శిగా కందకుర్తి ఆనంద్, కార్యదర్శిగా భూపతి, కోశాధికారి సాయిరెడ్డి, మహిళా ప్రముఖ్‌గా రాధా, సంపర్క ప్రముఖ్‌గా నర్సింహా, ఈసీ మెంబర్లుగా వెంకటమల్లయ్య, నవీన్, సురేష్, దయానంద్, జయకృష్ణ, నిఖిలేష్, ప్రవీణ్‌లు నియమితులయ్యారు.

'కబ్జాదారుల నుంచి రక్షించండి '

ఆర్మూర్‌టౌన్, జూన్27: నందిపేట గ్రామ పొలిమేరల్లో తమ ప్లాట్లను కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని వారి నుంచి తమ భూములను రక్షించాలని లబ్ధిదారులతో కలిసి ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మూగ ప్రభాకర్ కోరారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో వారు మాట్లాడుతూ 2004లో రాష్ట్ర ప్రభుత్వం 630/1 గల సర్వేనెంబర్‌లో పట్టాలను జారీ చేసిందని అందులో గుడిసెలు వేసుకుంటున్న తరుణంలో అక్కడే ఉన్న కొందరు భూకబ్జాదారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ వేసిన గుడిసెలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదు చేశామని, అధికారుల విచారణ అనంతరం లబ్ధిదారులకే చెందాలని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ కబ్జా చేస్తున్న విషయమై నందిపేట ఎస్సై, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులు తస్నీరు గంగామణి, సురేఖ, ధనలక్ష్మీ, వాణి వెంకటేష్, లలిత, లక్ష్మీ, నికత్‌పర్వీన్‌బేగం, అఫ్జాద్‌బీ, హఫీస్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

150 కిలోల ప్లాస్టిక్ సీజ్

ఆర్మూర్‌టౌన్, జూన్27: మున్సిపల్ పరిధిలోని పలు షాప్‌లలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించి 150కిలోల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. పర్యవరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను వాడవద్దని సూచించిన పలు షాప్‌లలో ప్లాస్టిక్ వాడడంపై అధికారులు షాప్ యాజమానులకు నోటీసులు జారీ చేస్తూ. ప్లాస్టిక్‌ను సీజ్ చేసినట్టు పర్యవరక్షణ ఇంజనీర్ పూర్ణమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ జవాన్ రాజన్న, మున్సిపల్ సిబ్బంది అక్షయ్, రవి, ప్రశాంత్; తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

జక్రాన్‌పల్లి, జూన్27: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన మార్గం గౌతమిబ(25) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై సీహెచ్. తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామంలో మార్గం గౌతమి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మార్గం గౌతమి గతకొన్ని రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతుందని, బాధ భరించలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో గౌతమి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఆమె భర్త బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లి నెల రోజుల క్రితం భర్త చిన్నబాలరాజు గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడని తెలిపారు. మృతురాలికి మూడేళ్ళ కొడుకు ఉన్నారన్నారు. సంఘటన స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై సిహెచ్.తిరుపతి, తహసీల్దార్ కిరణ్మాయి పరిశీలించి పంచనామా నిర్వహించారని తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అరెస్టుకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, జూన్ 27:ఏబీవీపీ నిర్వహించిన విద్యాసంస్థల బంద్ సందర్భంగా పోలీసుల అత్యుత్సాహంతో నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ గురువారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయకార్యవర్గ సభ్యుడు శివ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ బంద్ పిలుపునివ్వడం జరిగిందని జిల్లాలో మాత్రం రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పోలీసులు అత్యుత్సాహంతో ఏబీవీపీ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేశారని అన్నారు. సీపీ ప్రైవేటు విద్యాసంస్థలకు మద్దతు తెలుపుతూ ఏబీవీపీ నాయకులపై క్రిమినల్ కేసులు పెట్టడం సరికాదని, దీనిపై ప్రభుత్వం స్పందించి వెంటనే కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శశి, సునీల్, జగదీశ్, దుర్గాదాస్, ప్రవీణ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సకాలంలో పూర్తి చేయాలి'

రెంజల్,జూన్27: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పాఠశాలలో చేపడుతున్న నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు అంబేద్కర్ నగర్, బోర్గాం, మౌలాలి తండా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను వేసిందన్నారు.ఈ కమిటీల ద్వారా పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తుందన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సునీల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కార్తిక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రుద్రూరు, జూన్ 27 : పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.7,910 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైన పేకాట ఆడినట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మాక్లూర్: కొత్తపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి రూ.10వేల300 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సుదీర్‌రావు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం'

బోధన్‌రూరల్,జూన్27: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ వచ్చిందన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఏకకాలంలో రైతుల సంక్షేమం కోసం రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హరికాంత్ చారి, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌసోద్దీన్, శరత్ రెడ్డి, చిరంజీవి, తలారి నవీన్, కలీం, గోపాల్ రెడ్డి, సంగ్రామ్, బోధన్ సొసైటీ చైర్మన్ ఉద్మీర్ లక్ష్మణ్, వీరభద్రరావు, రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నిజామాబాద్ అర్బన్, జూన్ 27:ధన్‌పాల్ లక్ష్మిబాయి-విఠల్‌గుప్త చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం నగరంలోని కోటగల్లి శంకర్‌భవన్, దుబ్బ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తన ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత 20 ఏళ్లుగా తన ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, నిజామాబాద్ అర్బన్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, వైద్యం అం దించాలన్నదే తన లక్ష్యమన్నారు. గతంలో హామీ మేరకు దుబ్బ పాఠశాలలో విద్యార్థులకు బెంచీలు, ఫర్నిచర్ అందజేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

రక్త పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది

లింగంపేట, జూన్27: లింగంపేట మండలంలోని 7వ వార్డులో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది కాలనీలోని 50 గృహాలలో రక్త పరీక్షలు నిర్వహించారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పారిశుధ్య లోపంతో ఒకరికి డెంగ్యూ' అని కథనానికి అధికారులు స్పందించారు. కాలనీలో రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించడంతో వైద్యాధికారి హిమబిందు పోకల సాయికృష్ణ ఇంటికి సాయికృష్ణ రక్త నమూనాలు సేకరించారు. టైఫాయిడ్ పాజిటివ్‌గా వచ్చిందని, డెంగ్యూ నిర్ధారణ కోసం కామారెడ్డికి ల్యాబ్‌కు పంపిచామని వైద్యాధికారి తెలిపారు. వారి కుటుంబ సభ్యులతో పాటు కాలనీలోని 50 గృహాలలోని వారి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్ కు పంపినట్లు ఆమె తెలిపారు.

సమీకృత భవన పనుల పరిశీలన

నసురుల్లాబాద్, జూన్27: మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మండల సమీకృత భవన నిర్మాణ పనులను ఎంపీపీ పాల్త్య విఠల్, వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ భవనాన్ని తొందరలో పనులు పూర్తిచేసి త్వరలో సంబంధిత అధికారులకు ఈ భవనంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని ఎంపీపీ పాల్త్య విఠల్, స్థానిక కాంట్రాక్టర్‌లకు సూచించారు. తొందరలో ఈ భవన పనులను పూర్తిచేసి అందుబాటులో తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీవో రాము, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బస్వన్నపల్లిలో కాంగ్రెస్ మండల కమిటీ సమావేశం

రాజంపేట, జూన్27: మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో యాదవ సంఘంలో గురువారం కాంగ్రెస్ మండల కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన మాటప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయడం హర్షనీయమని తెలిపారు. అదేవిధంగా 6 గ్యారెంటీల్లో భాగంగా గృహాజ్యోతి పథకం గ్రామాలలో అర్హులను గుర్తించి పథకాల కోసం ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు ప్రతీ కార్యకర్త ముందుండి ప్రజలకు అందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాక్షుడు శ్రీధర్, సెక్రెటరీ సంజీవరెడ్డి, ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు సహదేవ్, మండల యూత్ అధ్యక్షుడు బాల్‌రాజ్ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

భిక్కనూరు, జూన్27: లింగ నిర్ధారణ పరిక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ శిరిష అన్నారు. గురువారం భిక్కనూరు మండలకేంద్రంలోని ఆరోగ్యకేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ గర్భస్రవాలు, భ్రూణ హత్యలు నివారించాలని, లింగనిర్ధారణ పరిక్షలు చేసిన వారికి, సహకరించిన వారిపై చరట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భ్రూణ హత్యలతో ఆడపిల్లల జననాలు తగ్గుతున్నాయన్నారు. అనంతరం మండల వైద్యాధికారిణీ యేమిమా మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పద్ధతులు, తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ, సొసైటీ డైరెక్టర్

రాజంపేట, జూన్27: మండలంలోని పొందుర్తి ఎంపీటీసీ బాలరాజు గౌడ్, రాజంపేటసొసైటి డైరెక్టర్ శ్రీరామ్ సురేష్‌లు గురువారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు కామారెడ్డి నియోజకవర్గంలో ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్‌అలీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై మండలాన్ని ప్రభుత్వం ద్వారా మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకురావడం కోసం పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారావు, అసెంబ్లీ యూత్ సెక్రటరీ ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత యువ శిబిరం ప్రారంభం

కామారెడ్డిటౌన్, జూన్ 27: దేశంలోని యువత సన్మార్గంలో వెళ్లాలని జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన,క్రీడల శాఖాధికారి వై దామోదర్,యూనైటెడ్ యూత్ ప్రాజెక్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం కామారెడ్డి జిల్లాకేంద్రంలోని కళాభారతీలో యువ శిబిర కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సమైక్య యువ శిబిరం కామారెడ్డిలో ఏర్పాటుచేయడం గర్వకారణమని అన్నారు. దేశంలోని 14 రాష్ట్రాల నుంచి యువతీ, యువకులు సుమారుగా 250 మందికి పైగా పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 30 వరకు ఈ యువ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. అంతకముందు పట్టణంలో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఎన్‌వైపీ స్టేట్ ప్రెసిడెంట్ యాదవరాజ్,లెక్చరర్ శ్రీనివాస్, యూత్ ప్రాజెక్ట్ సభ్యులు సంగ్రామ్, అల్లావుద్దిన్, శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి
కేంద్రప్రభుత్వమే బాధ్యత వహించాలి'



జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాలు



మాట్లాడుతున్న నాయకులు

కామారెడ్డిటౌన్, జూన్ 27: నీట్ ప్రశ్న పత్రం లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎన్‌టీఏ చైర్మన్‌ను అరెస్ట్‌చేయాలని డిమాండ్ చేస్తు విద్యార్థులతో కలిసి విద్యార్థి సంఘాలు గురువారం కొత్తబస్టాండ్ నుంచి ఆర్‌డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుస పేపర్‌లీకేజీలతో కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ అధికారుల నిర్లక్ష్యంతో లక్షలాది విద్యార్థులు రోడ్డున పడ్డారని, ఎస్‌సీ,ఎస్‌టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను చదువుకు దూరం చేయాలని పేపర్‌కురూ.30లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేసి అంగట్లో సరుకుల విద్యను వ్యాపారం చేశారని అన్నారు. దేశవ్యాప్తంగా నీట్, నెట్ పేపర్ లీకేజీపై భారీ ఎత్తున ఆందోళన చేస్తున్నా బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు.పరీక్ష పే చర్చ, మన్‌కి బాత్ అనే ప్రధాని ప్రశ్నపత్రాల లీకేజీలపై చర్చజరపాలని, 24లక్షల మంది విద్యార్థులకు ఏ విధంగా న్యాయం చేస్తారో చెప్పాలని అన్నారు. పేపర్ లీకేజీ జరిగి 3 వారాలు గడుస్తున్న ఇప్పటివరకు కేంద్రం ప్రధాన సూత్రదారిని అరెస్ట్‌చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తు నిజమైన సూత్రదారులను తప్పించే ప్రయత్నం చేస్తుందని అన్నారు. తెలంగాణ నీట్ విద్యార్థుల తరపున బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తక్షణ స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ముదాంఅరుణ్, బీడీఎస్‌ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు ఆజాద్, బీవీఎం రాష్ట్రకార్యదర్శివిఠల్, పీడీఎస్‌యూ రాష్ట్రకోశాధికారి సురేష్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు భరత్, సోఫియాన్, బుల్లెట్, రోషన్,నరేందర్, సురేష్, నవీన్ తదితరులున్నారు.

ప్రమాద బీమా చెక్కుల పంపిణీ

కామారెడ్డిటౌన్, జూన్27: కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్ మండల కేంద్రానికి చెందిన జ్యమగోనిప్యాట్ల నవ్యమృతిచెందగా ఆమె భర్త స్వామి గౌడ్‌కు, బీబీపేట మండలం యాడారం గ్రామానికి చెందిన అరేటి వడ్ల సంగమేశ్వర మృతిచెందగా అతని భార్య ఆరేటి స్వప్నలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.4లక్షలను బీఆర్‌ఎస్ పార్టీసభ్యత్వ భీమా నుండి మంజూరైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ బాలమణి, పార్టీ నాయకులు బల్వంత్‌రా వు, రమేష్, అధికార ప్రతినిధి బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు ప్రమాద బీమా చెక్కు పంపిణీ

భిక్కనూరు, జూన్ 27: భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో మృతుడి కుటుంబానికి పోస్టాఫీసు ప్రమాద బీమా చెక్కును గురువారం నిజామాబాద్ డివిజన్ ఎస్‌ఎస్‌పీవో జనార్ధన్‌రెడ్డి, కామారెడ్డి సబ్‌డివిజన్ అధికారి సుజిత్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన పాలసీదారుడు బైని కొండల్‌రెడ్డి ఇటీవల కరెంట్‌షాక్‌తో మృతి చెందగా నామిని అయిన అతడి సోదరుడు బాపురెడ్డికి రూ.10లక్షల బీమా చెక్కును అందజేయ్యడం జరిగిందన్నారు. పోస్టాఫీసులో కేవలం రూ.520లతో అందిస్తున్న ఈ ప్రమాదబీమాను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐపీపీబీ మేనేజర్ పవన్‌రెడ్డి, భిక్కనూరు సబ్ పోస్టుమాస్టర్ రాజేందర్‌రెడ్డి, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాల కోసం కప్పకావడి ఆటలు

తాడ్వాయి, జూన్27: మండలకేంద్రంలో గురువారం వర్షాలకోసం గ్రామస్తులు, యువకులు కప్పకప్పకావడి ఆటలు ఆడారు.ఈ సందర్భంగా శ్రీ శబరిమాత హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో కప్పకప్పకావడి ఆటలు ఆడుతూ ఒకరిపై ఒకరు నీళ్ల పోసుకుని వర్షాలు కురువాలని భగవంతుని ప్రార్థించారు. వర్షాలు కురువకపోవడంతో వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయని భగవంతుడు కరుణించి వర్షాలు కురిసేలా చూడాలని ప్రార్థించారు. అనంతరం వరద పాశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



కప్పకావడి ఆటలుఆడుతున్న గ్రామస్తులు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

టోల్‌ప్లాజా వద్ద రవాణా శాఖ అధికారుల వాహనాల తనిఖీలు

భిక్కనూరు, జూన్27: మండలంలోని 44వ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద జిల్లా రవాణశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీటుబెల్టు ఉపయోగించని, కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వాడుతున్న 30 మంది వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా డీటీవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనలు పాటించని 30మంది వాహనదారులకు జరిమానాలు విధించడం జరిగిందన్నారు. కారులో ప్రయాణించేవారు తప్పక సీటుబెల్టు ధరించాలని, కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ అంటించొద్దన్నారు. నిబంధనలు పాటించని వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహారించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కలిసికట్టుగా కృషిచేద్దాం

సదాశివనగర్, జూన్ 27: మాదక ద్రవ్యాలను కలిసికట్టుగా నిషేధించాల్సిన అవసరం ఎంతైన ఉందని ఏపీయం రాజారెడ్డిఅన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా ఐయస్ ఆర్‌డీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థులు ప్రజలు చాలా ఇబ్బందులు,సమస్యలకు గురి అవుతున్నారో అవగాహన పెంచడంతో పాటు,ఈ సమస్యను పరిష్కరించడానికి అవసరమైన చర్యలను వివిధ ప్రభుత్వశాఖలు చేపడుతున్న మనంఅందరం సమిష్టిగా ఎదుర్కోవాల్సిన సమయం వచ్చిందని అన్నారు.కార్యక్రమంలో ఐయస్ ఆర్‌డీ ప్రధానకార్యదర్శి రాజేందర్,మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, ఐయస్‌ఆర్‌డీ స్వచ్ఛందసంస్థ ప్రతినిధి విఠల్‌రావు, సీసీలు ఆంజనేయులు, రాములు, నరేందర్, లింగం, సౌజన్య, కృష్ణాంజలి పాల్గొన్నారు.

తైబజార్ వేలం

గాంధారి, జూన్27: గాంధారి గ్రామపంచాయతీ పరిధిలో ని తైబజార్ వేళాన్ని శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు గ్రామపంచాయతీ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అదేపద్ధతిలో ఉంటుందని తెలిపారు.

దోమకొండలో వాహనాల తనిఖీ

దోమకొండ, జూన్ 27: బీటీఎస్ నుంచి దోమకొండ వచ్చే రోడ్డులో గురువారం దోమకొండ అబ్కారీ సీఐ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో అబ్కారీ పోలీసులు ము మ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాలు, అక్రమ మద్యం, గంజా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ప్రతీవాహనాన్ని క్షుణ్ణ ంగా పరిశీలించారు. తనిఖీల్లో ఎస్సై సుదర్శన్, జీవన్, వహిద్, బాల్‌రాజు, మోహినొద్దిన్ పాల్గొన్నారు.

'విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు'

రామారెడ్డి, జూన్27: విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని డీఆర్‌డీఓ పీడీ చందర్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ని సమావేశానికి హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ శక్తి పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ తీసుకోవాలన్నారు.రెండో ఫేస్‌క్లాత్ కటింగ్ సెంటర్‌ను సందర్శించి పలు సలహాలు,సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సవితా, ఐకేపీ ఏపీఎం ప్రసన్న కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులను అడ్డుకున్న కాలనీవాసులు

- డ్రైనేజీ నీరు తమ కాలనీ వైపు మళ్లించొద్దంటూ సిబ్బందితో వాగ్వాదం
- నిలిచిన నిర్మాణ పనులు

బీర్కూర్, జూన్27: మండల కేంద్రంలో కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ఇందిరాకాలనీ వాసులు అడ్డుకున్నారు. డ్రైనేజీ నీరు తమ కాలనీ వైపు మళ్లించేలా ఎందుకు పనులు చేపడుతున్నారని రోడ్డు సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీర్కూర్‌లో ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మిస్తున్నారని తెలిపారు. అయితే రోడ్డుకు ఇరు వైపులా డ్రైనేజీలోని మురికి నీరు అంతా ఇందిరా కాలనీకి మళ్లించేలా నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీ వాసులు ఆరోపించారు. ప్రతీ వర్షాకాలంలో వర్షం నీటితో పాటు డ్రైనేజీలోని మురికి నీరు, పంట కాలువ నీరు పొంగిపొర్లుతూ ఇళ్లలోకి వస్తుందన్నారు. ప్రస్తుతం డ్రైనేజీలు నిర్మిస్తున్నారని, మురికి నీరు అంతా ఇందిరాకాలనీ వైపు ప్రవహించేలా పనులు చేపట్టారని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. మురికి నీరు గ్రామ పొలిమేరకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు రోడ్డు సిబ్బందికి సూచించగా వారు దురుసుగా సమాధానం ఇచ్చారు. దీంతో కాలనీ వాసులు రోడ్డు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందిరాకాలనీ వైపు డ్రైనేజీ నీరు రాకుండా వేరేవైపు మళ్లించాలని అప్పటివరకు డ్రైనేజీ పనులు నిలిపివేయాలని కాలనీ వాసులు హెచ్చరించారు. దీంతో పనులు నిలిచిపోయాయి.



పనులను అడ్డుకుంటున్న కాలనీ వాసులు

అప్పు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు దాడి

- పలువురిపై కేసు నమోదు



దాడి ఘటనపై విచారణ జరుపుతున్న పోలీసులు

నాగిరెడ్డిపేట, జూన్ 27: తీసుకున్న అప్పు తిరిగి ఇచ్చేయాలని అడిగినందుకు బూతులు తిట్టడంతోపాటు ఇంటిపైకి వచ్చి పలువురు వ్యక్తులు దాడి చేసిన ఘటన మండలంలోని బొల్లారంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. బొల్లారం గ్రామానికి చెందిన గొల్ల పండరి అదే గ్రామానికి చెందిన ఈగురం రాజాగౌడ్‌కు రూ.25వేల అప్పు ఇచ్చాడు. అయితే పండరి గురువారం రాజాగౌడ్ ఇంటికి వెళ్లి తనకు ఇవ్వాల్సిన రూ.25 వేలు ఇవ్వాలని అడిగాడు. దీంతో రాజుగౌడ్ బూతులు తిట్టాడని, ఈ విషయంపై రాజాగౌడ్ అన్న యాదగిరి గౌడ్‌కు చెప్పగా అతను కూడా తన తమ్మునికే మద్దతు తెలిపాడని రాజాగౌడ్ తనపై చేయి చేసుకున్నట్లు పండరి ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. అంతేకాకుండా వారిద్దరితో పాటు వారికి సంబంధించిన పోతగోని రవిగౌడ్, బబ్లూ, అరవింద్, రాజేశ్వర్ గౌడ్‌తోపాటు మరికొందరు తమ ఇంటిపైకి వచ్చి కర్రలతో తమ ఇంటిని ధ్వంసం చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో పాటు తన భార్య తమ వదినలపై సైతం వారు దాడిచేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాజుగౌడ్, యాదగిరిగౌడ్‌తో పాటు దాడి చేసిన మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. దాడి ఘటనపై గ్రామంలో విచారణ జరిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొక్కలను పంపిణీ చేసిన బీజేపీ నాయకులు

దోమకొండ, జూన్ 27: మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు విపుల్ జైన్, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఏక్ పెడ్ మా కానామ్ కార్యక్రమంలో మొక్కలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, కంది మనోజ్ కుమార్, లింగం, నరేష్, భరత్, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి,గణేష్, రవి, సచిన్‌గౌడ్, హరీష్, అంజిరెడ్డి,ఎస్‌పాల్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



దోమకొండలో మొక్కలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- మహారాజ
ప్రియా 70	- ఓంజి

బాన్సువాడ

మహేశ్వరి	- ఓంజి
వెంకటేశ్వర	- నింద

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230